క్లుప్తంగా

ప్రయోగ పరీక్షలు ప్రారంభం

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చిన మేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు శనివారం ప్రారంభమైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ జి.శివప్రసాద్ తెలిపారు. ఇక్కడి కళాశాల విద్యార్థులతో పాటు గరుగుబిల్లి మండలంలోని రావివలస కేజీబీవీ విద్యార్థులు కూడా ఇక్కడే పరీక్షలు రాస్తున్నారన్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 19వతేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని, పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బెల్లంఊట ధ్వంసం

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చిన మేరంగి గ్రామ పరిసరాల్లో నిర్వహిస్తున్న సారా బట్టీలపై పోలీసులు ఆకస్మిక దాడులు శనివారం నిర్వహించారు. ఎస్ఐ పి.అనీష్ ఆధ్వర్యంలో సిబ్బంది మొత్తం 7 డ్రమ్ముల బెల్లంఊట గుర్తించి, ధ్వంసం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని చినమేరంగి సీఐ టీవీ తిరుపతిరావు తెలిపారు. డ్రోన్ కెమెరాల సాయంతో సారాబట్టీలు, గంజాయి తోటల సాగు పరిశీలిస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

జోరుగా కంకర తవ్వకాలు



కొండ వద్ద జేసీబీ సహాయంతో కంకర తవ్వకాలు

వీరఘట్టం: మండలంలోని యు.వెంకమ్మపేట – రేగులపాడు గ్రామాల సమీపంలో ఉన్న కొండల వద్ద ఇటీవల కాలంలో కంకర అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ప్రభుత్వ పనుల కోసం అని చెప్పి కొందరు ఈ తవ్వకాలు చేపడుతున్నారు. వాస్తవానికి ఈ కంకరను రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తున్నారు. అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తవ్వకాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పోటెత్తిన భక్తులు



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

గరుగుబిల్లి: ఆలయ పునఃనిర్మాణం తర్వాత మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. శనివారం ఉదయం నుంచి గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చొని మరీ దైవదర్శనం చేసుకున్నారు. ఉదయం సుప్రభాతసేవ, మంగళాశాసనం తదితర పూజా కార్యక్రమాలు జరిగిన అనంతరం వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్ల దర్శనానికి భక్తులకు అవకాశం కల్పించారు. భగవంతుని దర్శనం తర్వాత పుట్టుదేవుని వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

వట్టిగెడ్డను కాపాడండి..



తోటలా ఉన్న వట్టిగెడ్డ వంతెన సమీపంలో ఉన్న ప్రాంతం

వీరఘట్టం: పెద్ద పెద్ద చెట్లు, మొక్కలతో ఉన్న ఈ చిత్రం మైదాన ప్రాంతం కాదు.. అలాగని ఏదో తోట కూడా కాదు.. వీరఘట్టం సమీపంలోని వట్టిగెడ్డ వంతెన దిగువ భాగంలో ఉన్న పరీవాహక ప్రాంతం. గెడ్డ అభివృద్ధిని ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగిపోయి మైదాన ప్రాంతంలా మారింది. ఇదే అదునుగా చేసుకుని గెడ్డకు ఇరువైపులా ఆక్రమణలు పేరుకుపోయాయి. ఈ ఆక్రమణలను ఎవరూ అడ్డుకోకపోవడంతో ఇటీవల కాలంలో మరిన్ని ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. కనీసం ఉపాధి పనుల్లో భాగంగానైనా గెడ్డ పరిసరాలను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సారా పట్టివేత

వీరఘట్టం: మండలంలోని హుస్సేనుపురం గ్రామ శివారులో సారా తరలిస్తున్న సిరిపురం శ్రీను అనే వ్యక్తిని శనివారం అదుపులోకి తీసుకుని కేసు నమో దు చేసినట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు. అతని వద్ద నుంచి 12 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వాహనపత్రాలు తప్పనిసరి

మక్కువ: మక్కువ – చినబోగిలి రహదారి వద్ద ఎస్ఐ వెంకటరమణ శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వాహనదారులుకు రహదారి నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతీ వాహనదారుడు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. వాహనదారునికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మురుగు కష్టాలు..



కస్పావీధి సమీపంలో కాలువలో పేరుకుపోయిన చెత్త



కాపువీధి కాలువలో చెత్త



సిర్లిపోతన్న వీధి సమీపంలో మురుగు కాలువ దుస్థితి

డివిజన్ కేంద్రమైన పాలకొండ నగర పంచాయతీలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఓ వైపు భారీగా ఇంటిపన్ను వసూలు చేస్తున్నా.. అందుకు తగిన విధంగా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ముఖ్యంగా కాలువలు మరీ దారుణంగా ఉన్నాయి. ఏ ఒక్క కాలువలో కూడా మురుగుతీసిన దాఖలాలు లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీనికితోడు అవే కాలువల గుండా తాగునీటి పైప్‌లైన్లు ఉండడంతో తాగునీరు కూడా కలుషితం అవుతోంది. పూడికతీతలకు ఇటీవల కాలంలో రూ. 30 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నిధులతో ఎక్కడ పనులు చేశారో వారికే తెలియాలి. ఇటీవల సీపీఎం నాయకులు వార్డుల్లో పర్యటించి, పారిశుధ్య పనులకు నిధులు ఎంత ఖర్చు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కమిషనర్ సర్వేశ్వరరావు వద్ద ప్రస్తావించగా నిధులు సక్రమంగా ఖర్చు చేస్తున్నామని, పూడికతీత పనులు చేపడుతున్నామని వివరించారు. – పాలకొండ



చిన్నకాపు వీధి వద్ద మురుగుతో నిండిన కాలువ



గురువుగారి వీధి వద్ద నిలిచిన మురుగునీరు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

జియ్యమ్మవలస రూరల్:

ప్రతిఒక్కరూ వ్యక్తిగ త పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యుడు పి.జగదీష్ సూచించారు.స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రం చేసి, పరిసరాల పరిశుభ్రత ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండకుండా చూసుకోవాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు.

జియ్యమ్మవలస రూరల్: స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని చినమేరంగి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణను శుభ్రం చేశారు. చెత్తాచెదారం ఏరివేసి, ఆస్పత్రి పరిసరాల్లోని పిచ్చిమొక్కలు తొలగించారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యులు సునీల్, చైతన్య, రమ్య తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని అల్లువాడ గ్రామంలో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంగు పరిశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఏరియా ఆస్పత్రిలో..

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది పరిసరాలను పరిశుభ్రం చేశారు. సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు నేతృత్వంలో సిబ్బంది పరిసరాలను శుభం చేయడంతో పాటు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డీవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో..

పాలకొండ: స్థానిక ఏరియా ఆస్పత్రిలో స్వచ్ఛ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు సూచించారు. స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఆస్పత్రి వైద్య సిబ్బందితో కలిసి కార్యక్రమంలో పాల్గొని, ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతినెలా మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేయాలని, మన చుట్టూ ఉన్న పరిసరాల పరిశుభ్రతకు పాటుపడి తద్వారా ఆరోగ్యవంతమైన సమాజానికి సహకరించాలని కోరారు. జిల్లా ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ కార్యక్రమ వివరాలను కేటాయించిన యాప్‌లో పొందుపరచాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్, వైద్యాధికారి కె.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని గొట్టివలస గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ శనివారం చేపట్టారు. ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పరిసరాలను ఏ విధంగా శుభ్రం చేసుకోవాలి.. పరిసరాల పరిశుభ్రత ద్వారా కలిగే ప్రయోజనాలను వైద్యారోగ్య సిబ్బంది వివరించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతకు పాటుపడదామని ప్రతిజ్ఞ చేయించారు.



జియ్యమ్మవలస రూరల్: పీహెచ్‌సీ పరిసరాలు శుభ్రం చేస్తున్న సిబ్బంది



గరుగుబిల్లి: రావివలస పీహెచ్‌సీ వద్ద స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు



సీతంపేట: ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు



జియ్యమ్మవలస రూరల్: ఆస్పత్రి పరిసరాల్లోని ఆకులు, చెత్తను ఏరివేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



గరుగుబిల్లి: అవగాహన ర్యాలీలో ఈవోపీఆర్‌డీ గోపాలరావు, తదితరులు



పాలకొండ: పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న వైద్య సిబ్బంది

వేలంపాటకు స్పందన కరువు

వీరఘట్టం: జిల్లా అటవీశాఖ పరిధిలో వీరఘట్టం మండలంలోని వండువ కొండపై ఉన్న జీడితోటలకు ఈనెల 5న, 11న రెండు సార్లు వేలం పాట నిర్వహించగా స్పందన కరువైంది. చివరిసారిగా శనివారం నిర్వహించిన వేలం పాటకు కూడా పాటదారులు ఎవరూ ముందుకు రాలేదని వీరఘట్టం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రవిబాబు తెలిపారు. వండువ కొండపై ఉన్న 1302 జీడి మొక్కల ఫలసాయం అనుభవించేందుకు ఈ నెల 5న నిర్వహించిన వేలం పాటలో అధికారులు ప్రారంభ ధరగా రూ. 6 లక్షలు నిర్ణయించారు. అయితే పాటదారులు రూ. 2 లక్షల వరకు మాత్రమే పాడారు. దీంతో పాట రద్దు చేసి 11వ తేదీన మరోసారి చేపట్టగా ఎవ్వరూ ముందుకు రాలేదు. మళ్లీ శనివారం నిర్వహించిన పాటకు పాటదారులు ఎవ్వరూ ముందుకు రాలేదు. దీంతో అటవీ శాఖాధికారులే స్వయంగా మొక్కల సాగు చేపట్టనున్నారు. గతేడాది కూడా అధికారులే సాగు చేయగా 510 కిలోల పిక్కలు రాగా ప్రభుత్వానికి రూ. 59 వేల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది ఆమాత్రం దిగుబడి వచ్చే అవకాశం లేదని స్థానికులు చెబుతున్నారు.

నైపుణ్యాలను వెలికితీయాలి

వీరఘట్టం: తరగతి గదిలో పాఠాలు బోధించడమే కాకుండా, మనం చెప్పే పాఠాలు విద్యార్థులకు అర్థమవుతున్నదీ, లేనిదీ గుర్తించాలని, అలాగే వారిలో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీయాలని ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కత్తులకవిటి, బిటివాడ, కంబరవలస క్లస్టర్ సమావేశాలలో పాల్గొని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అలాగే సిలబస్, టీచింగ్ ప్లాన్, వెనుకబడిన విద్యార్థులను గుర్తించడం, వీరికి ప్రత్యేక తరగతులు నిర్వహణ, పాఠశాలలో మౌలిక వసతులు, తదితర అంశాలపై క్లస్టర్ చైర్మన్లు సీహెచ్. రత్నాకరరావు, బి.సాంబర, పి.సుధారాణి, వై.లక్ష్మి దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశాల్లో అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, సబ్జెక్ట్ టీచర్లు, ఎస్జీటీలు, భాషోపాధ్యాయులు పాల్గొన్నారు.



కంబరవలస క్లస్టర్ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఖైదీలకు ఆరోగ్య తనిఖీలు..



సబ్ జైల్‌లో ఉన్న ఖైదీలకు ఎప్పటికప్పుడు ఆరోగ్య తనిఖీలు చేపట్టాలని జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ తనిఖీ అథారిటీ కార్యదర్శి ఆర్.సన్యాసిరావు సూచించారు. శనివారం స్థానిక సబ్‌జైల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఖైదీల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రిమాండ్ ఖైదీలకు న్యాయ సలహాలు, సేవలు అందిస్తామని తెలిపారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని ఖైదీలకు తామే ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది జోగులు పాల్గొన్నారు. – పాలకొండ

విజేతలకు బహుమతులు..



భామిని మండలంలోని బత్తిలిలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన వారికి సర్పంచ్ టింగ శాంతికుమారి బహుమతులు అందజేశారు. – భామిని

పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం..



పరిసరాల పరిశుభ్రతే మన ధ్యేయమని ఎంపీడీఓ బి.వెంకటరమణ అన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కుంబిడి గ్రామంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. అలాగే వీరఘట్టంలో ఈఓ రవి ఆధ్వర్యంలో స్థానిక రామమందిరం జంక్షన్‌లో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్ నియంత్రణకు అందరూ కృషి చేయాలని కోరారు. – వీరఘట్టం

సమావేశాల పేరిట కాలయాపన తగునా..!

వీరఘట్టం: రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్ కాంప్లెక్స్‌లకు బదులుగా క్లస్టర్లు ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వం ఈ సమావేశాల పేరిట కాలయాపన చేస్తోందని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు వరకు క్లస్టర్ సమావేశం నిర్వహించారు. అయితే ఐదు గంటలకు సమావేశం ముగిసినప్పటికీ టీచర్ అటెండెన్స్ యాప్ ఓపెన్ కాకపోవడంతో ఉపాధ్యాయులందరూ క్లస్టర్ సమావేశ భవనాల వద్ద అటెండెన్స్ కోసం మరో 45 నిమిషాలు పడిగాపులు కాయాల్సి వచ్చింది. వాస్తవానికి ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకే పాఠశాల పనివేళలు కాగా.. శనివారం క్లస్టర్ సమావేశం పేరిట మరో గంట పాటు ఉపాధ్యాయులను ఉంచారు. అయితే సమావేశం ముగిసిన తర్వాత టీచర్ అటెండెన్స్ యాప్‌ను ప్రభుత్వం నిలిపివేసిందని, దీంతో చాలా మంది దూరప్రాంతాల నుంచి వచ్చి న ఉపాధ్యాయులు అటెండెన్స్ వేసుకోలేకపోయార ని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం 5.45 గంటల వరకు క్లస్టర్ సమావేశాల వద్ద ఉంటే.. తాము ఇంటికి ఎప్పుడు వెళ్లేదని విద్యాశాఖ అధికారుల తీరుపై ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే నెల జరగనున్న క్లస్టర్ సమావేశాలను సాయంత్రం 4 గంటల వరకే పరిమితం చేయాలని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి.

విపత్తులపై అవగాహన

సీతంపేట: మండలంలోని గోరపాడు, చిన్నబగ్గ గ్రామాల్లో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో విపత్తులు, వాతావరణ మార్పులపై శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల కలిగే నష్టాలు, తేనెమంచు, తదితర అంశాలపై వివరించారు. అలాగే జీడిపంట, కంది, జొన్న, కొర్రలు, ఊదలు, తదితర పంటల సస్యరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ వెన్నెల, మిన్నారావు, గోపాలరావు, పార్వతి, లావణ్య, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి, జియ్యమ్మవలస, బీజేపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు శనివారం జరిగాయి. ఫిబ్రవరి నెల సిలబస్, విద్యార్థులకు బోధించాల్సిన పాఠ్యాంశాలు, బోధనా విధానాలపై చర్చించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అభిప్రాయాలు వెల్లడించారు.

గరుగుబిల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలోని క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం తరహాలో క్లస్టర్ స్థాయి సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులంతా క్లస్టర్ నిర్వహణ, పాఠ్యాంశాల బోధన, సిలబస్ పూర్తి, నూతన విద్యావిధానం వంటి అంశాలపై చర్చించారు.

ఆక్రమణలు తొలగించండి..

వీరఘట్టం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న స్థలం ఆక్రమణలకు గురవుతున్నా ఎవ్వరూ పట్టించుకోకపోవడంపై ఈ నెల 11న సాక్షిలో 'ఆక్రమణలో హైస్కూల్ ప్రాంగణం' పేరుతో కథనం ప్రచురితమైంది. దీంతో ఆర్అండ్‌బీ డీఈ జగన్నాథరావు స్పందించి శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. స్థలంలో వేసిన రేకు ల షెడ్డును వెంటనే తొలగించాలని సంబంధిత వ్యక్తిని సూచించారు. ఆక్రమణదారులకు పంచాయ తీ నుంచి నోటీసులు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. అయితే చాలా మంది ఆర్అండ్‌బీ స్థలాల్లో షె డ్లు వేశారని వాటిన్నంటినీ తొలగించాలని, హైస్కూ ల్ ప్రాంగణంలో షెడ్డు వేసిన వ్యక్తి అధికారులను కోరారు. ఆక్రమణలన్నీ తొలగిస్తామని డీఈ బదులిచ్చారు.

సాక్షి ఎఫెక్ట్...



ఆక్రమణలో హైస్కూల్ ప్రాంగణం

సాక్షిలో ప్రచురితమైన కథనం

ప్రహరీకి అడ్డులేని చెట్ల తొలగింపు సరికాదు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని పెదబుడ్డిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి అడ్డుగా లేని చెట్లను తొలగించడం సరికాదని గ్రామస్తులు ఖండించారు. ఇటీవల ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ.39 లక్షల నిధులు మంజూరు కాగా, నిర్మాణం చేసేందుకు అడ్డుగా ఉన్నాయంటూ పాఠశాల ఆవరణలోని మొత్తం 63 చెట్లను కాంట్రాక్టరు నరికివేయడం ఆరంభించారు. సదరు కాంట్రాక్టరు ఎటువంటి అనుమతులు లేకుండా ఆ చెట్లను తొలగిస్తుండడంతో వివాదమైంది. ప్రధానోపాధ్యాయుడు దగ్గరుండే ఆ చెట్లను నరికివేయిస్తున్నారని గ్రామస్తులు మండిపడ్డారు. వీఆర్‌వో దూసి తిరుపతిరావును ఇదే విషయంపై సంప్రదించగా, విషయం తహసీల్దారుకు తెలియజేశామన్నారు. గ్రామస్తులు కూడా అక్రమంగా చెట్ల నరికివేతపై ఎంపీడీవో ఎస్.రమేష్, ఎంఈవో శ్రీనివాసరావులకు లిఖిత పూర్వక ఫిర్యాదులు అందజేశామన్నారు. ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, దీనిపై కలెక్టరుకు కూడా ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు చెబుతున్నారు.



పాఠశాల ఆవరణలో కూల్చివేసిన చెట్లు

యాప్‌లతో ఆపసోపాలు

పార్వతీపురం రూరల్: అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ఉపాధ్యాయులకు అగచాట్లు తప్పడం లేదు. ప్రభుత్వం కొత్తగా క్లస్టర్ విధానాన్ని అమలు చేసి శనివారం మధ్యాహ్నం వరకు పాఠశాలను నిర్వహించి మధ్యాహ్నం క్లస్టర్ సమావేశాలకు వెళ్లాలని ఉన్నతాధికారులు ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయులు హాజరును మూడుసార్లు వేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఉదయం ఆయా పాఠశాలల్లో హాజరు వేశారు. మధ్యాహ్నం 1గంట తరువాత క్లస్టర్ సమావేశాల హాజరును యాప్‌లో నమోదు చేయాలని, సాయంత్రం 5.30 తరువాత వెళ్లే ముందు హాజరు వేయాలని సూచించారు. అయితే హాజరు యాప్‌లలో నమోదు కాకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందారు. ఉన్న యాప్‌ల తోనే వేగలేకపోతుంటే ప్రభుత్వం కొత్తగా యాప్‌ల్లో కొత్త అంశాలను జోడించడంతో హాజరు నమోదు కావడం లేదని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ కార్యదర్శి సూర్యనారాయణ పేర్కొన్నారు. పెదబొండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు తమ హాజరును నమోదు చేసేందుకు శనివారం కుస్తీలు పట్టారు.



పెదబొండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హాజరు నమోదు చేసేందుకు ఉపాధ్యాయుల అవస్థలు